## ఆర్టీసీ బస్సు ఢీకొని లైన్‌మెన్ మృతి

### విద్యుత్ శాఖలో విషాద ఛాయలు



**పల్నాడు ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా నకరికల్లు మండలంలో చోటుచేసుకుంది. బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విద్యుత్ శాఖలో గుండ్లపల్లి లైన్‌మెన్‌గా పనిచేస్తున్న జూపల్లి రాజారత్నం (40) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లుకు చెందిన రాజారత్నం గుండ్లపల్లి గ్రామంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆయన నరసరావుపేట నుండి తిరిగి నకరికల్లు వస్తుండగా, పిడుగురాళ్ల నుండి నరసరావుపేట వైపు వెళు న్న ఆర్టీసీ బస్సు ఆయన ప్రయాణిస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది.ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాజారత్నం ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఉంటూ ఇలా అకాల మరణం చెందడంతో రాజారత్నం కుటుంబంలో మరియు విద్యుత్ శాఖలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి పోలీసుల దర్యాప్తు




**పల్నాడు ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. వివరాల్లోకెళ్తే.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం, రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామంలో 44 ఏళ్ల మహిళ బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలు వేల్పుల మల్లేశ్వరిగా గుర్తించారు. మృతదేహంపై గాయాలు గుర్తించారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## తేనెటీగల పెంపకంతో పంట ఉత్పాదకత పెరుగుతుంది



**ఎమ్మిగనూర్ ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తేనెటీగల పెంపకంతో ఆదాయాన్ని పొందడంతోపాటు పంటల ఉత్పాదకత పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అన్నారు. బుధవారం వనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల శాస్త్రీయ పెంపకంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ రైతులు ఉద్యాన, ఇతర పంటల్లో తేనెటీగల పెట్టెలు పెట్టుకోవడం వల్ల దిగుబడులు పెరుగుతాయని, తేనె పట్టుతో నెలకు రూ.వెయ్యి నుంచి రూ. 1500 ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ యువతకు తేనెటీగల పెంపకం ఉపాధిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎస్ మహమ్మద్ ఖాద్రి, ఏవో శివశంకర్, శాస్త్రవేత్త డాక్టర్ శ్రీచందన, ఏఈఓ నరసింహులు రైతులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ పనులను పరిశీలించిన కేంద్ర కార్యదర్శి



**గుంటూరు ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను కేంద్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు అవసరమైన నిధులను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజకు సూచించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం నాటికి ఆ భవనాలను ప్రారంభించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగసాయి కుమార్ పలువురు అధికారులు ఉన్నారు.

## నందిగామలో గాలివాన గుబులు.. నేలవాలిన మొక్కజొన్న!

**నందిగామ ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :**నందిగామ నియోజకవర్గంలోని జుజ్జూరులో మంగళవారం కురిసిన భారీ వర్షం రైతులను ఆందోళనకు గురి చేసింది. ఆకస్మికంగా కురిసిన వర్షానికి తోడు గాలివాన తీవ్రత ఎక్కువగా ఉండటంతో పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటలు పాక్షికంగా నేలవాలిపోయాయి. కొన్నిచోట్ల పొలాలు పూర్తిగా తడిసి ముద్దవడంతో నీరు నిలిచిపోయింది. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో సాగు ఖర్చులు అధికమయ్యాయి. ఇలాంటి సమయంలో వర్షం రూపంలో వచ్చిన ఈ ప్రకృతి విపత్తు రైతులపై అదనపు భారం మోపిందని వారు వాపోతున్నారు. ముఖ్యంగా గాలివాన ధాటికి మొక్కజొన్న కాండాలు వంగిపోవడం వల్ల గింజల నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. నేలవాలిన పంటను మళ్లీ



నిలబెట్టడం కష్టసాధ్యమని, దిగుబడి తగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. జుజ్జూరుతో పాటు పరిసర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు తమ పొలాల్లో నీరు వెళ్లేలా కాల్వలు తవ్వే ప్రయత్నం చేస్తున్నారు. అయితే మళ్లీ వర్షాలు పడితే పరిస్థితి మరింత విషమించే అవకాశముందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే నష్టాన్ని అంచనా వేసి పరిహారం ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పంట నష్టంపై నివేదిక సిద్ధం చేయాలని కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల దెబ్బకు వరుసగా నష్టాలు చవిచూస్తున్న తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు

## మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### మార్చి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ




**రాయదుర్గంటౌన్ ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గ్రామీణ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా విద్యనందించే ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు (ఏపీ మోడల్ స్కూల్) ఒక వరం. 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకు htt ps://apms.apcfss.in లేదా www.cse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 12న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఏ మండలంలోని విద్యార్థులకు ఆ మండలంలోని ఆదర్శ పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. 2025--26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉన్న విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని అధికారులు తెలిపారు. ప్రవేశ పరీక్ష అనంతరం ప్రతిభ, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జిల్లా అధికారులు సీట్ల భర్తీకి ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం

పభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన వారై ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.125 ఫీజు చెల్లించాలి. దరఖాస్తుతోపాటు ఆధార్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు హార్డ్ కాపీని ఆదర్శ పాఠశాలల్లో అందజేయాలి.

## ఆర్డీటీ పరిరక్షణకు పోస్టు కార్డు ఉద్యమం

### మార్చి 10న కుందుర్పిలో లాంఛనంగా ప్రారంభం

### వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, సమన్వయకర్త రంగయ్య డిమాండ్

**అనంతపురం ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పేదలకు ఇతోధికంగా సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థ సేవలు కొనసాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధ రించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యతో కలిసి అనంత మీడియాతో మాట్లాడారు. ఆర్డీటీ పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మార్చి 10న కుందుర్పిలో పోస్టుకార్డు ఉద్యమం లాంఛనంగా చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఆర్డీటీ వరం లాంటిదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతి, విద్య, వైద్యం, క్రీడలు, మహిళా సాధికారతలో ఆర్డీటీ సేవలు అందించిందని తెలిపారు. కేంద్రం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకపోవడంతో గతంలోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రతి కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మద్దతుగా నిలవడమే కాకుండా భాగస్వామ్యం కూడా అయ్యిందని గుర్తు చేశారు. ఓ వైపు ఉద్యమాలు జరుగుతుంటే మరోవైపు అధికార



పార్టీ నేతలు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంతో మాట్లాడామని స్వయంగా మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. గతంలో మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ కూడా ఆర్డీటీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ఎమ్మెల్యేలు కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లామని, న్యాయం జరుగుతుందని హామీలు ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి సానుకూలతా రాలేదన్నారు.

## భక్తిశ్రద్ధలతో నరసింహ దీక్ష విరమణ



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఎగువ అహోబిలం అటవీ ప్రాంతంలో మానవుల సన్నిధిలో నరసింహ దీక్ష విరమణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 41 రోజులపాటు స్వామి మాల స్వీకరించి దీక్ష చేపట్టిన మాలాధారులు ఇరుముడులతో వేలాది సంఖ్యలో అహోబిలానికి చేరుకున్నారు. మాలోల నరసింహ స్వామి సన్నిధిలో ఆలయ అర్చకుడు కల్యాణ రంగన్ సుదర్శన హోమం నిర్వహించారు. మాలధారులు స్వామిని పూజించి సంకల్పం తీసుకొని దీక్ష విరమణ చేశారు. ఈ సందర్భంగా మాలధారులతో అహోబిలం ఆలయం కిక్కిరిసింది .

## అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహించాలి

**బాపట్ల ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నక్యాంటీన్ రాష్ట్ర సీఈవో పి.వాసుదేవ్ అన్నారు. బుధవారం ఆయన బాపట్ల కమిషనర్ ఛాంబర్‌లో అన్న క్యాంటీన్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించే బాధ్యత సిబ్బంది, అధికారులపై ఉందన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో బాపట్ల అన్న క్యాంటీన్ల సేవలపై 91శాతం మంది ప్రజలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఇది సిబ్బంది అందిస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. క్యాంటీన్లలో ఆహార నాణ్యత, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత అంశాల్లో రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది



నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు అన్న క్యాంటీన్ల సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో బాపట్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఎస్.ఆర్ కృష్ణారెడ్డి, పొన్నూరు, రేపల్లె మున్సిపాలిటీల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, క్యాంటీన్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

### న్యాయమూర్తి టి ప్రవళిక




**పిడుగురాళ్ల ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర న్యాయ సవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు ది. 14-3-2026 ( రెండవ శనివారం) మండల న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల వారి ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కమ్ సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) టి ప్రవళిక నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రీ లిటిగేషన్ కేసులు ( ముందస్తు వాయిద్యములు ) తదితర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చు అని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము, ధనము ఆదా అవుతుందని తెలియజేశారు. ది 14-03-2026( రెండవ శనివారం)న పిడుగురాళ్ల సివిల్ జడ్జి ( జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ జరుగును. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవలసిందిగా కోరడమైనది.

## మంగళగిరిలో శరవేగంగా పలు అభివృద్ధి పనులు



**తాడేపల్లి ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. ఇప్పటికే రూ. వందల కోట్లతో నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామంలో కోకా కోలా ఇండియా వారి సీఎస్ఆర్ నిధులు రూ. 35 లక్షలతో పలు అంగన్వాడీ, పాఠశాల్లో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అంగన్వాడీ-52, అంగన్వాడీ-53, అంగన్వాడీ-54 లను ఆధునీకీకరించారు. అంగన్వాడీ-62కు స్మార్ట్ టీవీ అందజేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆధునికీకరించి ఒక మానిటర్, రెండు స్పీకర్లు, ఒక డెస్క్‌టాప్, 6 సీసీ కెమెరాలు, 20 జతల స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. మంత్రి నారా లోకేశ్ కృషితో మంగళగిరి ప్రజలు, స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వాహనదారుల తిప్పలు.. తీర్చేదెవరు?

**విశాఖ ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలోని ప్రధాన కూడళ్లలో ఒకటి ద్రోణం రాజు సర్కిల్. ఈ సర్కిల్‌లో ఎప్పుడూ వాహనదారులకు తిప్పలే. అధికారులకు పరీక్షలా మారింది ఇక్కడి పరిస్థితి. కూడలిలో ఓ వైపు పార్కు ఉంది. దీంతో వాహనాలు తిరగడానికి ఇబ్బందిగా మారింది. పార్కు నిర్వహణ సైతం సరిగా లేదు. ఆ మార్గంలో వాహనాలు వెళ్తుంటే అక్కడున్న టైర్లు అడ్డం పడుతున్నాయి. వాటిని ఢీకొట్టి పలువురు వాహనదారులు కింద పడిన సందర్భాలూ ఉన్నాయి. వీటిని తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

## గృహాలు పూర్తి చేసేందుకు రూ.180 కోట్లు విడుదల చేయాలి -సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి



**ఒంగోలు ఫిబ్రవరి 25 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేసేం దుకు, భవనాల సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించ డానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.180 కోట్లు విడుదల చేయాలని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ టిడ్కో గృహాలను పూర్తి చేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నగర కమిటీ నాయకులతో కలిసి ఒంగోలు శివారులోని చింతలలో టిడ్కో గృహాలను ఆమె సందర్శించారు. గృహ సముదాయంలో పనుల గురించి షాపూర్‌జీ పలోంజీ ప్రతినిధి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే టిడ్కో గృహాలను పూర్తి చేసి ఇస్తామని చెప్పిన చంద్రబాబు గత రెండేళ్లుగా లబ్ధిదారులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒంగోలు పరిధిలో మూడు స్కీముల్లో ప్రారంభించిన గృహాలను ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేసినప్పటికీ, లబ్ధిదారులు కూడా బ్యాంకు రుణాల ద్వారా తమ వాటా చెల్లించినప్పటికీ గృహాలు పూర్తి చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. లబ్ధిదారులపై వడ్డీ భారం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు సర్కారే వడ్డీ భారాన్ని భరించాలని డిమాండ్ చేశారు. రియల్ టైం గవర్నెన్స్ అని డప్పాలు కొట్టుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో టిడ్కో గృహాలను ఎందుకు నిర్మించలేకపోయిందో జవాబు చెప్పాలని నిలదీశారు. కేరళం రాష్ట్రంలో ఫూరెస్ట్ ఆఫ్ ఫూర్ పేరుతో పక్కా గృహాలు నిర్మించి ఇస్తుండగా ఇక్కడ ఎందుకు అలా ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు.

